క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

సరుబుజ్జిలి: రోజువారీ తనిఖీల్లో భాగం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం మండలంలోని పలు ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. స్టాక్ రికార్డులు, సేల్స్ వివరాలు పరిశీలించారు. అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



రమణను సత్కరిస్తున్న రొట్టవలస గ్రామస్తులు

సరుబుజ్జిలి: అధిష్టానం అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ తెలిపారు. రొట్టవలసలో సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ జిల్లాలోని బీసీలు అందరినీ సమన్వయం చేసుకుని మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టే దిశగా కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్, స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసుని కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: నేరడి కొండపై గల వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆలయం 42వ వార్షికోత్సం ఈ నెల 23 నుంచి శనివారం వరకు ఆలయ ధర్మకర్త గరుకు యతిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులతోపాటు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, మొజ్జాడ చక్రపాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

కొత్తూరు: యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఎన్నికల పరిశీలకులు జి.మాధవరావు, శ్రీరామచంద్ర తెలిపారు. కమిటీ ఎన్నికను అడవికొత్తూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా పి.లక్ష్మణరావు, అధ్యక్షుడిగా కె.వి జయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.క్రాంతి కుమార్, సహ అధ్యక్షులుగా డి.స్వర్ణలత, ఎస్.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎన్.వంగమేస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వరదరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహ కార్యదర్శులు తొమ్మిది మంది, జిల్లా కౌన్సిలర్లుగా ఆరుగురిని ఎన్నుకున్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు, సిబ్బంది

బూర్జ: మండలంలోని డొంకలకర్త గ్రామ కూడలిలోని ఆర్అండ్‌బీ రహదారిపై ఎస్ఐ బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా బూర్జ, మన్యం జిల్లా పాలకొండ మండలాల మధ్య ఇటీవల ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట



ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

- ఉపాధి జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం
- అక్రమాలకు అడ్డుకట్ట..

ఆమదాలవలస రూరల్: ఉపాధి పనుల్లో అక్రమాలను అడ్డుకట్టవేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. ఇప్పటికే ఉపాధి జాబ్‌కార్డులతో వేతనదారుల ఆధార్ అనుసంధానం ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. వేతనాల చెల్లింపు, ఇతర అంశాల్లో పారదర్శకత రానుంది. గతంలో ఒకరికి రెండు జాబ్‌కార్డులు ఉన్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. వివాహాలు, ఇతర ప్రాంతాలకు వలసపోయిన సందర్భాలు, మరుగుదొడ్డి, ఇళ్ల నిర్మాణాలు పనుల కల్పనకు సంబంధించి రెండో జాబ్‌కార్డు పొందిన ఘటనలు అనేక ఉన్నాయి. జాబ్‌కార్డుల మంజూరులో తనిఖీలు లేక అదనపు కార్డుల సంఖ్య పెరిగింది.

ముందంజలో సరుబుజ్జిలి, కొత్తూరు..

ఆధార్ సీడింగ్‌లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి సరుబుజ్జిలి మండలం 99.72 శాతం, పాతపట్నం నియోజకవర్గంలో కొత్తూరు మండలం 99.37 శాతంతో ముందంజలో ఉన్నాయి. పొందూరు మండలం 89.87 శాతం చివరి దశలో ఉంది. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని 13 మండలాల్లో 2,99,282 మంది వేతనదారులకుగాను 2,90,168 మందికి ఆధార్ సీడింగ్ పూర్తికాగా 9,114 మంది వేతనదారులకు ఆధార్ సీడింగ్ కాలేదు.

యాప్‌లో నమోదు..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక వేతనదారుడికి పని కల్పించాలంటే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (ఎన్ఎంఎంఎస్) నమోదు తప్పనిసరి. గతంలో 20 మందికి పైగా వేతనదారులకు పని కావాలంటే మాత్రమే ఎన్ఎంఎంఎస్ నమోదు చేసేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికారు. పనుల పర్యవేక్షణ, కల్పన, హాజరులో తదితర అంశాల్లో అక్రమాల నిరోధానికి యాప్ దోహదపడుతుంది.

ఆధార్ నమోదు కాని వారికి ఇబ్బందులు..

కొన్ని మండలాల్లో ఆధార్ అనుసంధానం ప్రక్రియ నత్తనడకన సాగుతున్నందున వేతనాలు సకాలంలో అందడంలేదు. మరికొన్ని ప్రాంతాల్లో పనులకు వెళ్లలేకపోతున్నారు. ఆధార్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం దృష్టి సారించి శత శాతం ఆధార్ సీడింగ్ నమోదుకు కృషి చేయాలని వేతనదారులు కోరుతున్నారు.

ఆధార్ నమోదు వివరాలు

మండలం	కూలీలు	ఆధార్ సీడింగ్	పూర్తయిన శాతం
ఆమదాలవలస	18398	15573	92.07
సరుబుజ్జిలి	13229	13262	99.72
పొందూరు	33754	30336	89.87
బూర్జ	20926	20676	98.81
నరసన్నపేట	24138	23723	98.28
జలుమూరు	27107	26310	97.06
పోలాకి	33527	32876	98.06
సారవకోట	22471	22284	99.17
పాతపట్నం	20782	20275	97.56
హిరమండలం	15510	15238	98.25
మెళియాపుట్టి	21891	20457	93.45
కొత్తూరు	33018	32809	99.37
ఎల్ఎన్‌పేట	14531	14349	98.75

ప్రక్రియ వేగవంతం చేశాం



ఉపాధి జాబ్‌కార్డుల్లోని సభ్యులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేశాం. దీనిని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక డ్రైవ్‌ను గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. వేతనాల చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిచేస్తున్నాం.

– జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం జిల్లా

కష్టపడి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు



స్పీకర్ సీతారాంతో ఎం.వి.స్వరూప్, పార్టీ నాయకులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం స్పీకర్ సీతారంను పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేలా కష్టపడాలని సూచించారు. స్పీకర్‌ని కలిసిన వారిలో పార్టీ నాయకులు సాధు వైకుంఠం, డి.అజిత్, వి.నాగరాజు, రామకృష్ణ, టి.బాలు, జె.ఎం.శ్రీనివాస్, నక్క రామరాజు, ఎస్.రామారావు, కె.తేజ, అప్పన్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన స్వరూప్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మెంటాడ స్వరూప్ శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కలిశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, జిల్లాలో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యువజన విభాగాం కీలకమని, పార్టీ అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. తూర్పుకాపు సంఘం ప్రతినిధులు పలువురు ఉన్నారు.



ఎమ్మెల్యే కృష్ణదాస్ పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న స్వరూప్

సుధాకర్‌ను గెలిపించాలి



సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఒకటో ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని తోటవాడ, అయ్యవారిపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి సీతంరాజుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా జయంతి

నరసన్నపేట: అవతార్ మెహర్‌బాబా 129వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పైడితల్లి ఆలయ కూడలిలో ఉన్న అవతార్ మెహర్‌బాబా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి భక్తి గీతాలు ఆలపించారు. మెహర్‌బాబా చిత్రపటానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన అవతార్ మెహర్ బాబా దేవునితో సమానమని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కొత్తూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పి.బాల, ఎస్ఐ ఎం.గోవిందరావు శనివారం పరిశీలించారు. పోలింగ్ గదిలోకి వెలుతురు రావడంతోపాటు దివ్యాంగులు ఓటు వేసేందుకు ర్యాంపులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అంశాలను కళాశాల సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కులపేట గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సమితి కన్వీనర్ చిడిపోతు సూర్యారావు, జోన్ యూత్ ఇన్‌చార్జి సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణదాత ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు 6305087092 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

ఎల్.ఎన్.పేట: పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఇంటర్ మధ్యలో మానేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్ ద్వారా పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. దరఖాస్తులను సోమవారం సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 6281775849 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలోని ప్రభుత్వ భూముల్లో టీడీపీ నాయకులు తప్పుడు పట్టాలు సృష్టించి చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ పి.బాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు శనివారం ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడు రౌతు అనంతరావుతోపాటు పలువురు నాయకులు తప్పుడు పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఆర్ఆర్ కాలనీలో 308ఏ/341ఏ నంబర్ ప్లాట్‌లో పట్టా పొందిన సదాశివుని చిన్నమ్ముడుకు, హిరమండలం సుభలాయి కాలనీలో ప్లాట్ నంబర్-9లో పట్టాను మంజూరు చేశారని తెలిపారు. ఈమె భర్త నారాయణరావుకు మెట్టూరు బిట్-1లో 341 పట్టా మంజూరైందన్నారు. మెట్టూరు బిట్-1 కాలనీలో 341ఏ నంబర్‌తో టీడీపీ ఎంపీటీసీ సి.హెచ్.గిరి పేరిట తప్పుడు పట్టాను సృష్టించారన్నారు. గిరి భార్యకు హిరమండలం సుభలాయిలో ఇంటి స్థలం మంజూరైందన్నారు. వీరితో పాటు అక్రమ మార్గాల ద్వారా పట్టాలు పొందిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పలు దఫాలు తహసీల్దార్, వీఆర్వోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అక్రమ పట్టాలు, నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మెట్టూరు బిట్-1 రిజర్వ్ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు

నాణ్యమైన వైద్యం అందించాలి

కొత్తూరు: కురిగాం పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్యం అందివ్వాలని ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కమిటీకి శ్రీలక్ష్మి వివరించారు. పారిశుద్ధ్య పనులు, లేబరేటరీ పరికరాలు, ఆస్పత్రి ఆవరణలో మొక్కల పెంపకం, పల్స్‌పోలియో ఖర్చులు, స్టేషనరీ, మందుల రవాణా ఖర్చు, దోబీలతోపాటు పలు రకాల ఖర్చులు కోసం హెచ్‌డీఎఫ్ నిధులు ఖర్చు చేసేందుకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. పీహెచ్‌సీ పరిధిలోని 72 గ్రామాల్లో 150 మంది వైద్య సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్‌కు దీటాగా నాడు-నేడు నిధులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నామన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించి రాష్ట్రంలోనే మంచి పేరుతీసుకువాలన్నారు. వైద్యాధికారి సందీప్ కుమార్, కురిగాం సర్పంచ్ సేపాన అశోక్ కుమార్, ఈఓ బుజ్జిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి

నేటినుంచి పాదాలమ్మతల్లి సిరిమాను ఉత్సవం

నరసన్నపేట: మండలం సత్యవరంలో ఆదివారం నుంచి పాదాలమ్మతల్లి సిరిమాను మహోత్సవం మూడు రోజులపాటు జరగనుంది. ఈ మేరకు గ్రామంలో ఏర్పాట్లు చేశారు. పాదాలమ్మతల్లి ఆలయాన్ని అలంకరించారు. సత్యవరం గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టారు. ఆదివారం గ్రామ దేవతను తీసుకువస్తామని, సోమవారం ఘటాలు ఊరేగింపు, మంగళవారం సిరిమాను ఊరేగింపు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి తెలిపారు. ఈ మూడు రోజులు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పచ్చదనానికి సూర్యుడే సాక్షి..



రబీ వరి పంట ఆశాజనకంగా ఉండటంతో ఎటుచూసినా పచ్చదం పరిచినట్లు కనిపిస్తోంది. పోలాకి మండలం ప్రియాగ్రహారం వద్ద డీపీఎన్ (డోల–పోలాకి–నౌపడ) రోడ్డు వెళ్తున్నపుడు శనివారం సాయంత్రం కనిపించిన దృశ్యం ఇది. అటుగా వెళ్లిన వాహనదారులు ముచ్చటపడి కాసేపు ఆగిమరీ ఫొటోలు తీసుకునేంతగా ఆకర్షించిన వాస్తవ చిత్రం సాక్షికి చిక్కింది. వంశధార కాలువ ద్వారా సాగునీరు అందించే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుచూపుతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిన నేపథ్యంలో రబీ వరి కనుచూపుమేరలో సాగు అవుతుంది. ఒక్క ప్రియాగ్రహారం రెవెన్యూ పరిధిలోనే దాదాపు 350 ఎకరాలు వరి పంట సాగుచేస్తున్నట్లు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డి.అనిల్ తెలిపారు.

- పోలాకి

సీతంరాజు విజయానికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, ఎమ్మెల్సీ అభ్యర్థులు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులు, ఎమ్మెల్సీ ఓటర్లకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ నరసన్నపేటకు శనివారం వచ్చారు.

ఈ సందర్భంగా నరసన్నపేట పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ ప్రధాన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తరాంధ్రను తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే చంద్రబాబుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. తొలి ప్రాధాన్యతా ఓటు తనకు వేయాలని సుధాకర్ కోరారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, స్థానిక నాయకులు చింతు రామారావు, నక్క తులసీదాస్, సురంగి నర్సింగరావు, ముద్దాడ బాలభూపాలనాయుడు, సదాశివుని కృష్ణ, తంగుడు జోగారావు, సాసుపల్లి కృష్ణబాబు, పతివాడ గిరీశ్వరారావు, వాన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల మధ్య నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ తెలిపారు. కళాశాలలోని ల్యాబ్ గదుల్లో సీసీ కెమెరాలు అమర్చే పనులను శనివారం పరిశీలించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ గ్రూప్, వృత్తి విద్యాకోర్సు విద్యార్థులకు ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రాక్టిక్ పరీక్షలు ఉంటాయన్నారు. మాస్ కాపియింగ్ జరగకుండా ఉండేందుకు ఇంటర్ బోర్డు సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.



సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఈనాడు పత్రిక ప్రతులు దహనం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస పునరావాస కాలనీలో ఈనాడు పత్రిక ప్రతులను మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు, స్థానిక సర్పంచ్ రెడ్డి రామారావు శనివారం దహనం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వాటి కోసం పక్కన పెట్టి తప్పుడు వార్తలు రాస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రికను ఎవరూ చదవ కూడదన్నారు. వైఎస్సార్‌సీపీపైన నిత్యం బురదజల్లుతూ, తప్పుడు లెక్కలు చూపిస్తూ వార్తలు రాస్తున్న ఈనాడుకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని తప్పుడు వార్తలు రాయటం బాధాకరమన్నారు. పార్టీ నాయకులు రెడ్డి లక్ష్మణరావు, రెడ్డి సీతారాం, ఎండ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు పత్రిక ప్రతులు దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లతో కలిసి కన్వీనర్లు, గృహసారథులు కృషిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలో స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బి.నారాయణరావు, పార్టీ నాయకులు చలపతి, చంద్రయ్య, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సంక్షిప్తంగా..

సీపీఎస్ రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తూరు: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, శాంతారావు ప్రభుత్వాన్ని కోరారు. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను తక్షణమే విడదల చేయాలని, జీతాలు ఒకటో తేది నాటికి చెలించాలన్నారు. పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నేతలు డీఎల్ నరసింహం, రఘుమహంతి, గోవర్దనరావు, సింహాద్రినాయుడు, యూటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల శిక్షణ

సారవకోట: మండలంలోని అడ్డవనస గ్రామంలో ఆదివారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి ఎల్లమ్మ ఉత్సవాలు

సరుబుజ్జిలి: ఈ నెల 27, 28 తేదీల్లో మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బలగ సింహాచలం శనివారం తెలిపారు. 27న సిర్లి పోతన్న ఊరేగింపు, 28న ఎల్లమ్మ తల్లి జాతర ఉంటుందన్నారు.

పింఛన్ల మంజూరుపై విచారణ

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామంలో ఇటీవల మంజూరైన పింఛన్లపై ఎంపీడీఓ హరిహరరావు శనివారం విచారణ చేపట్టారు. పింఛన్ల మంజూరులో అవకతవకలు జరిగాయని జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వాహనాల వేలం రేపు

ఆమదాలవలస: స్థానిక ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది వివిధ కేసుల్లో పట్టుపడిన ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను ఈ నెల 27న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ సీఐ కె.సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.1,000 ముందస్తు ఫీజు చెల్లించి, ఆధార్ కార్డు పట్టుకుని రావాలన్నారు.